

లక్షెట్టిపేట : పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు



హాజీపూర్ : గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



హాజీపూర్ : బీఆర్ఎస్ పార్టీలో చేరిన నంనూర్ గ్రామస్తులతో ఎమ్మెల్యేదివాకర్‌రావు



దండేపల్లి : రెబ్బెనపెల్లిలో రైతును ఓటు అడుగుతున్న విజిత్‌రావు.

# ఏ ఆపద వచ్చినా..మీ ఇంటి ముందుంటా..

- అవినీతిపరులకు ఇక్కడ స్థానం లేదు
- మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు



దండేపల్లిలో మొక్కజొన్న కొనుగోలు చేస్తూ ఓటు అడుగుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

దండేపల్లి, అక్టోబర్ 21: ఎవరికి ఏ ఆపద వచ్చినా మీ ఇంటి గుమ్మం ముందు ఉంటానని, హైదరాబాద్‌లో ఉండే వారికి మీ బాధలు ఎలా తెలుస్తాయని మంచిర్యాల బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. దండేపల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. పలువురు బీఆర్ఎస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాడుతూ స్థానికంగా ఉంటూ అభివృద్ధి చేస్తున్న వారినే ఆశీర్వదించాలని కోరారు. ఎన్నికలు రాగానే గ్రామాల్లో తిరిగే వారికి బుద్ధి చెప్పాలన్నారు. ఇప్పటికే గ్రామాలను ఎంతో అభివృద్ధి చేశామని, మరింత జరగాలంటే బీఆర్ఎస్‌కు మద్దతుగా కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ గురువయ్య, వైస్ ఎంపీపీ అనిల్, పీఏసీఎస్ చైర్మన్ కాసనగొట్టు లింగన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

**లక్షెట్టిపేటలో..**

లక్షెట్టిపేట, నవంబర్ 3: పట్టణంలోని 6వ వార్డుతో పాటు వివిధ వార్డులకు చెందిన యువకులు, ముస్లిం మైనార్టీ నాయకులు శుక్రవారం వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిక యువకులకు మంచిర్యాల ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు పార్టీ కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువత పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియజేస్తూ మరోసారి బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో కారుగుర్తుకు ఓటు వేసి గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. సుమారు 50 మంది యువకులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు చాతరాజు రాజన్న, సుధాకర్, సురేశ్ నాయక్, మెట్టు కల్యాణిరాజు, షబానసజ్జు, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాహెద్ అలీ, పార్టీ పట్టణ అధ్యక్షుడు పాదం శ్రీనివాస్, అన్వర్, నయీం, చాంద్, వజీర్ తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌తో అభివృద్ధి, సంక్షేమం సాధ్యం**

హాజీపూర్, నవంబర్ 3 : బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి. సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే దివాకర్ రావు అన్నారు. శుక్రవారం మండలంలోని కర్ణమామిడి, పడ్తన్‌పల్లి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత అనేక రకాల సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి అన్ని రకాల ప్రజలకు అందిస్తున్నారని, దీంతో పాటు అభివృద్ధిలో ముందంజలో రాష్ట్రం ఉందన్నారు. తెలంగాణ వైపు దేశం చూస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు గోళ్ల శ్రీనివాస్, కొట్టె మహేందర్‌తో పాటు పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌లో చేరికలు..** మండలంలోని నంనూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన మూడవ వార్డు సభ్యుడు ఆత్మకూరి మెండితో పాటు నాయకులు, కార్యకర్తలు 30 మంది ఎమ్మెల్యే దివాకర్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ చేరుతున్నామన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మొగిళి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నర్సింగాపూర్ నాయకులు పాల్గొన్నారు.

**అభివృద్ధి చేసిన వారినే ఆదరించండి..**

దండేపల్లి, నవంబర్ 3 : గ్రామాలను అభివృద్ధి చేసిన కారు పార్టీని, గులాబీ జెండాను రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆదరించాలని బీఆర్ఎస్ యువనాయకుడు నడిపెల్లి విజిత్‌రావు అన్నారు. దండేపల్లి మండలంలోని చింతపెల్లి, రెబ్బెన్‌పెల్లి గ్రామాల్లో శుక్రవారం మంచిర్యాల ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే దివాకర్‌రావుకు మద్దతుగా ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరుగుతూ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. ప్రతిపక్షాల కల్లబొల్లి మాటలకు మోసపోవద్దన్నారు. దివాకర్‌రావు కారు గుర్తుకు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ గురువయ్య, వైస్ ఎంపీపీ అనిల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, సర్పంచ్ కందుల కల్యాణి, బీఆర్ఎస్ నాయకులు కందుల అశోక్, అఫ్సర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## పేద యువతి వివాహానికి ఆర్థిక సాయం



దివ్యకు నగదు వస్త్రాలను అందజేస్తున్న మహిళా కమిటీ సభ్యులు

లక్షెట్టిపేట, నవంబర్ 3: శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిరుపేద యువతి వివాహానికి సభ్యులు చేయూతనందించి మానవత్వం చాటారు. దండేపల్లి మండలం రెబ్బనపల్లి గ్రామానికి చెందిన కుశ్నపల్లి దివ్య అనే నిరుపేదకు ఇటీవల పెండ్లి నిశ్చయమైంది. దివ్యకు తండ్రి లేకపోవడం పెండ్లి చేసేందుకు తల్లి పడుతున్న కష్టం తెలుసుకున్న సభ్యులు గురువారం రాత్రి సత్యసాయి సేవాసుధా మందిరంలో యువతికి రూ.5వేల నగదుతో నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు రమేశ్, సభ్యులు గంప రవీందర్, నగధర్, వసంత, రోజారాణి, సుమతి, సరోజ, తదితరులు పాల్గొన్నారు.

## ఇన్వెస్టిగేటర్లుగా డిగ్రీ కళాశాల విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ జైకిషన్ ఓజా

లక్షెట్టిపేట, నవంబర్ 3: పట్టణంలోని మోడల్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఇన్వెస్టిగేటర్లుగా అవకాశం వచ్చిందని, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జైకిషన్ ఓజా శుక్రవారం తెలిపారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసర్చ్ అండ్ ట్రేనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) విద్యా సాఫల్య సర్వేలో బాగంగా కళాశాలకు చెందిన 45 మంది విద్యార్థులను ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన కొంత మంది విద్యార్థులు లక్షెట్టిపేట మండలంలోని సుమారు 28 పాఠశాలల్లో 3,6,9 విభాగాల్లో మొత్తం 45 మంది విద్యార్థులను ఎంపిక చేసి వారందరికీ పాఠశాల విద్యలో కావాల్సిన మార్పులపై పరీక్ష నిర్వహించి వాటి మూల్యాంకనం కోసం ఎన్‌సీఈఆర్టీకి పంపించారని ఈ సర్వే ఆధారంగా విద్యా విధానానికి అవసరమయ్యే మార్పులను అధికారులు ఎంపిక చేస్తారని తెలిపారు. వీరిని ప్రిన్సిపాల్, డీఈవో యాదయ్య, ఎంఈవో రవీందర్, అధ్యాపకులు అభినందించారు.

## నిషేధాజ్ఞలు పొడిగింపు

గర్మిళ్ల, నవంబర్ 3 : రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై నిషేధాజ్ఞలు పొడిగిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం ప్రియుల ఆగడాలకు కళ్లెం వేయడంతో పాటు ప్రజల భద్రత, రక్షణ కోసం 1 నవంబర్ నుంచి 1 డిసెంబర్ వరకు ఈ నిషేధాజ్ఞలు కొనసాగుతాయని పేర్కొన్నారు. డీజే, డ్రోన్ కెమెరాలపై కూడా నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని తెలిపారు. పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఈ కాలపరిమితి పొడిగించే అవకాశం కూడా ఉందని పేర్కొన్నారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

## నేడు జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలు

మంచిర్యాల అర్బన్, నవంబర్ 3: జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్‌లో ఈ నెల 4న ఉదయం 9 గంటలకు జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో యాదయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొనేలా చూడాలని ఆయా మండలాల ఎంఈవోలు, పాఠశాలల హెచ్‌ఎంలను కోరారు. మొదటి స్థానంలో నిలిచిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

## ప్రశాంతంగా అభ్యాసన సామర్థ్యాలపై పరీక్ష

మంచిర్యాల అర్బన్, నవంబర్ 3: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని 3,6,9 తరగతుల విద్యార్థులకు శుక్రవారం అభ్యాసన సామర్థ్యాలపై పరీక్ష నిర్వహించారు. జిల్లాలోని 392 పాఠశాలల్లో 13,428 మంది విద్యార్థులకు గాను 13,126 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను డీఈవో యాదయ్యతో పాటు, ఆయా మండలాల ఎంఈవోలు తిరిగి పరిశీలించారు.

## ఎక్సైజ్ అధికారుల సోదాలు

లక్షెట్టిపేట, నవంబర్ 3: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ ఉల్లంఘనలో ఉన్నందున ఎక్సైజ్ అధికారులు లక్షెట్టిపేట, జన్నారం. దండేపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై, బెల్ దుకాణాల్లో సోదాలు నిర్వహింస్తున్నట్లు ఆ శాఖ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సాయిబాబా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజుల్లో సర్కిల్ పరిధిలో సుమారు 109 కేసులు నమోదయ్యాయని, 80 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీ చేసిన సమయంలో 304లీటర్ల గుడుంబా, 223 కిలోల స్పటిక, 234కిలోల బెల్లం, 95 లీటర్ల మద్యంతో పాటు, బీర్లు, మూడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామన్నారు. నేర చరిత్ర కలిగిన 26మందిని తహసీల్దార్ ముందు బైండోవర్ చేశామని, ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయించినా, గుడుంబా తయారు చేసినా, విక్రయించినా వెంటనే 8712658787 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ప్రకటనలో పేర్కొన్నారు.

## వెంకటాపూర్‌లో రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో రజిత

దండేపల్లి, నవంబర్ 3 : మండలంలోని నెల్కివెంకటాపూర్‌లో రైతులకు వరిపంటలో వచ్చే తెగుళ్లపై, పురుగుల మందు వాడకంపై మండల వ్యవసాయ విస్తీర్ణాధికారి రజిత శుక్రవారం అవగాహన కల్పించారు. వరి పంటలో ఆకుముడత ఉంటే పెరమిత్రిన్, కోరాజిన్ పిచికారీ చేయాలన్నారు. సుడి దోమను గమనించినట్లయితే పైమెట్రోజన్ పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గర్మిళ్ల, నవంబరు 3: మంచిర్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పట్టణ ఎస్ఐ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన బూడిద మణిదీప్ (29) ఐటీసీ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నాడు. పని నిమిత్తం శ్రీరాంపూర్ నుంచి మంచిర్యాలకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా స్థానిక ఓవర్ బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియలేదని ఎస్ఐ తెలిపారు.